సైట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఆర్ అండ్ ఆర్ కోసం భూముల పరిశీలన

ములుగు, ఏప్రిల్ 7: తాడిచర్ల, కాపురం గ్రామాల భూనిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కోసం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం రైతుల భూములను పరిశీలించారు. మొత్తం 271మంది లబ్ధిదారులకు ఇప్పటికే 134 మందికి ఆర్ఆర్ ప్యాకేజీతోపాటు ఇంటి స్థలం పంపిణీ చేశారు. మిగతా 137 లబ్ధిదారుల ఇంటి స్థలం కోసం సర్వే నంబర్ 610, 614 లో ఎనిమిది ఎకరాల భూములను రైతులు ఇచ్చేందుకు ముందుకురావడంతో ఆ భూములు అడిషనల్ కలెక్టర్ రైతులతో మాట్లాడి భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే మిగతా లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ సైట్ అందిస్తామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పాలనాపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ రాజశేఖర్, ఎంఆర్ కంపెనీ పీఆర్‌వో మల్లేశ్ ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మృతుల వివరాలు చెప్పాలి

- రైతుల ద్రోహి కాంగ్రెస్
- మాజీ ఎంపీ సీతారాంనాయక్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

వెంకటాపూర్, ఏప్రిల్ 7 : చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారి వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని మాజీ ఎంపీ, మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎన్‌కౌంటర్ చేయడం తప్పు అని, పట్టుకొని శిక్ష వేయడం మరిచి ఇలాంటి దారుణాలకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో రైతాంగం ఉందన్నారు. రైతుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బలరాం, జిల్లా ఇన్‌చార్జి పోలేపల్లి నరోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా జవహర్‌లాల్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కే సర్దార్, నాయకులు రవీంద్రాచారి, యాదగిరిగౌడ్, రవి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

మోడువారిన వృక్షాలు ఇలా.. కూలిపోతే ఎలా?

ప్రధాన రహదారిపైకి వంగి ఉన్న మోడు

మహదేవపూర్‌లో ప్రమాదకరంగా ఎండిన చెట్లు

మహదేవపూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ వృక్షాలు మోడువారి ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక బృహత్ పల్లె ప్రకృతి వనానికి ఎదురుగా రోడ్డును ఆనుకొని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు భయాందోళ నకు గురవుతున్నారు. ఎండిపోయి ఏళ్లు గడుస్తుండడంతో చెదలు పట్టి ఉండగా గాలికి కూలే అవకాశం ఉంది. మండలంలోని ఎనిమిది గ్రామాలతోపాటు పలిమెల మండలంలోని గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. ఎండిన వృక్షాలు రహదారిని ఆనుకొనే ఉండడంతో వాహనాలు ఢీకొట్టే ప్రమాదం కూడా ఉంది. ఇటీవల బొమ్మాపూర్‌లో రోడ్డు పక్కనే నిలిపి ఉన్న వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీకొట్టి ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందిన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి ఎండిన భారీ వృక్షాలను ప్రమాదాలు జరగకముందే తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- మహదేవపూర్, ఏప్రిల్ 7

ప్రధాన రహదారికి ఇరువైపులా ఆనుకొని ఎండిపోయిన మోళ్లు, ఎండిన వృక్షానికి పట్టిన చెదలు

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ బృందం

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 7 : మూడేళ్ల పాటు చిన్నబోయినపల్లిని గ్రామాన్ని దత్తత తీసుకొని సేవ కార్యక్రమాలు చేయాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ నారాయణ సూచించారు. మండలంలోని చిన్నబోయినపల్లిలో వారం రోజుల క్రితం ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవా క్యాంపు ఆదివారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఈ గ్రామాన్ని దత్తత తీసుకొని వలంటీర్లు క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక మాట్లాడుతూ వారం రోజుల పాటు చేసిన కార్యక్రమాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ ప్రభాకర్, గ్రామ పెద్దలు చంద్రమొగిళి, నర్సింహారెడ్డి, సుజాత, అమూల్య, అనూష, సుకన్య, రజిని, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ములుగురూరల్, ఏప్రిల్ 7 : మండలంలోని మల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేణు గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌ప్రెస్ ఫీడర్, పందికుంట సబ్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌తండా ఫీడర్‌లో మరమ్మతుల కోసం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సెంటర్ ఇన్‌చార్జి

మంగపేట, ఏప్రిల్ 7 : మండలంలోని కమలాపురంలో ఏర్పాటు చేసిన శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి మాక్ సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సెంటర్ ఇన్‌చార్జి అన్నపురెడ్డి శ్రీని వాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గణపురం, ఏప్రిల్ 7 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీపీ కావటి రజితా రవీందర్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పూర్తి నివేదికలతో వివిధ శాఖల మండల అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మలేశ్ యాదవ్

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

చిట్యాల, ఏప్రిల్ 7: మండలంలోని జడల్‌పేటలో శనివారం కామణి విజయలక్ష్మి(45) హత్య కేసులో నిందితులైన భర్త, పెద్ద కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో సీఐ మల్లేశ్ యాదవ్ వివరాలు వెల్లడించారు. విజయలక్ష్మి, చిరంజీవికి 30 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన భర్త తరచూ ఆమెను చితకబాదేవాడు. ఎనిమిదేళ్ల క్రితం హత్య ప్రయత్నం చేసినట్లు విచారణలో కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో పంచాయితీ జరగ్గా పెద్ద మనుషుల సమక్షంలో చిరంజీవిపై ఉన్న రెండు ఎకరాల భూమిని విజయలక్ష్మి పేర ఎక్కించాడు. ఆ భూమిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించుకొని పెద్ద కుమారుడు గణేశ్‌తో కలిసి చిరంజీవి పన్నాగం పన్నాడు. ఈనెల 6న గొంతు నులిమి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న చిరంజీవి, పెద్ద కుమారుడు గణేశ్ గాలించి ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పక్షుల దాహం తీర్చేందుకు మట్టి చిప్పల ఏర్పాటు


మట్టి చిప్పలో నీళ్లు పోస్తున్న తహసీల్దార్ వీరస్వామి

మంగపేట, ఏప్రిల్ 7 : మండుతున్న ఎండల దృష్ట్యా పక్షుల దాహం తీర్చేందుకు జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఎదుట చెట్ల వద్ద ఆదివారం మట్టి చిప్పలను ఏర్పాటు చేశారు. కాగా, ఈ చిప్పల్లో తహసీల్దార్ వీరస్వామి, ఎస్సై రవికుమార్, అధికారులు నీళ్లను నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షుల కోసం మట్టి చిప్పలను ఏర్పాటు చేసిన జ్వాలా ట్రస్టు బృందాన్ని అభినందించారు. పక్షులకు నీటితో పాటు చిరుధాన్యాలను కూడా పెట్టేందుకు చేసిన ఈ ఏర్పాటును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కోడెల నరేశ్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేశ్, ట్రస్ట్ గౌరవ సలహాదారు సయ్యద్ బాబా, ఉపాధ్యక్షుడు పుల్లంశెట్టి అజయ్, ముకుందం, కార్యదర్శి సతీశ్, కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, సూర్య, రోహిత్, దిలీప్ పాల్గొన్నారు.

కామేశ్వరాలయ పునాది రాళ్ల తొలగింపు

వెంకటాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని రామప్ప ఆలయ ప్రాంగణంలోని కామేశ్వరాలయ పునాది రాళ్ల తొలగింపును ఆదివారం పురావస్తు శాఖ అధికారులు ప్రారంభించారు. పది రోజుల నుంచి పునాది రాళ్ల చుట్టూ ఉన్న మట్టి తొలగించగా, పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి, రాళ్లకు నంబర్ వేసి, తొలగింపు పనులను చేపట్టారు. క్రేన్ సాయంతో రాళ్ల తొలగింపుతో పాటు ఇసుకను జేసీబీ ట్రాక్టర్లతో గార్డెన్ ఏరియాలో డంప్ చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తిగా రాళ్లను, ఇసుకను తరలించిన తర్వాత అధికారులు పరిశీలించి, పునాది పునర్నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

కామేశ్వర ఆలయ నిర్మాణ పనుల్లో ఇసుక తవ్వకాలు

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, రైతులు

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 7: మండల కేంద్రం నుంచి కమలాపూర్ వరకు రామన్నగూడెం, రాంనగర్ మీదుగా నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా చేసి, నిలిపేశారు. దీంతో రామన్నగూడెం గ్రామస్తులు, రైతులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ శ్రీనువాస్, ఆకుల రోశయ్య, శ్రీరాములు, రాజు, రాంబాబు, శ్రీనువాస్ ఉన్నారు.

ప్రశాంతంగా సంతోష్ అంత్యక్రియలు

సంతోష్ అంతిమయాత్రలో గ్రామస్తులు, సానుభూతిపరులు

కాటారం, ఏప్రిల్ 7: మావోయిస్టు అన్నె సంతోష్ అంత్యక్రియలు స్వగ్రామం అంకుషాపూర్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణ–చత్తీస్‌గఢ్ సరిహద్దులో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని ఆదివారం సాయం త్రం స్వగ్రామానికి తీసుకురాగా, కుటుంబ సభ్యులు, మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని అన్నె సమ్మక్క, ఐలయ్య దంపతుల పెద్ద కుమారుడు సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధరన్న 20 ఏళ్ల క్రితమే మావోయిస్టు పార్టీలో దళ సభ్యుడిగా చేరి సీఆర్ఎస్–2 డీవీసీఎం కమాండర్‌గా ఎదిగాడు. గతంలో జన జీవన స్రవంతిలో కలిసేలా కాటారం పోలీసులు తల్లిదండ్రుల ద్వారా యత్నించినా ప్రయోజనం లేకపోయింది. తమ కొడుకు ఎన్నటికైనా తిరిగి రాకపోతాడా ? అని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు శనివారం చేదువార్త తెలిసింది. 'వద్దంటే అడవిలోకి పోయినవ్.. ఒకటా రెండా.. 20 ఏళ్లుగా నీవు ఎప్పటికైనా తిరిగొస్తావని ఆశతో బతుకుతున్నం. కానీ నిన్ను ఇట్ల చూడనీకేనా మేం ఇంతకాలం బతికుంది..' అంటూ వారు రోదించారు. చత్తీస్‌గఢ్ బీజాపూర్‌కు వెళ్లగా అక్కడి ప్రభుత్వ దవాఖానలో పంచనామా అనంతరం మృతదేహాన్ని పోలీస్ అధికారులు అప్పగించారు. అంబులెన్సులో స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహం వద్ద మాజీ మావోయిస్టులు విప్లవ జోహార్లు అర్పించారు. కాటారం సబ్ డివిజన్‌లోని మావోయిస్టుల్లో కొందరు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా మరి కొందరు లొంగిపోయారు. సంతోష్ మాత్రమే అజ్ఞాతంలో ఉండగా శనివారం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. దీంతో కాటారం సబ్ డివిజన్‌లో మావోయిస్టుల పర్వం ముగిసింది. కాగా, సంతోష్ సోదరుడు రామ్ గతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, మరో సోదరుడు లక్ష్మణ్ ఈ ఊళ్లోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు.

ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 7: ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి మందల రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆరు ఆదర్శ పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 12గంటల వరకు 6వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7, 8, 9, 10వ తరగతుల ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు వివరించారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 328 మంది దరఖాస్తు చేసుకోగా 196 మంది, 7వ తరగతిలో 59 మంది దరఖాస్తు చేసుకోగా 38మంది, 8వ తరగతిలో 40మంది దరఖాస్తు చేసుకోగా 29 మంది, 9వ తరగతిలో 30 మంది దరఖాస్తు చేసుకోగా 21 మంది, 10వ తరగతిలో 6 మంది దరఖాస్తు చేసుకోగా నలుగురు హాజరైనట్లు తెలిపారు. చిట్యాల, కొర్కిశాల ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాలను డీఈవో రాంకుమార్ ఆకస్మిక తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గంగారం, ఎడ్లపల్లి, దొబ్బలపాడు పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్ సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచనలు, సలహాల మేరకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు

ఏటూరునాగారం, మార్చి 7 : మండలంలోని శంకరాజుపల్లిలోని చెరువు నుంచి ఆదివారం అక్రమంగా మట్టి తరలింపును అధికారులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తూ ఓపెన్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు తవ్వకాలను నిలిపేసేందుకు వెళ్లగా, సదరు వ్యక్తులు దురుసుగా వ్యవహరించగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మట్టి తవ్వకాలను నిలిపేశారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

ముస్లింలకు మంత్రి శ్రీధర్‌బాబు ఇఫ్తార్ విందు

మహదేవపూర్, ఏప్రిల్ 7: రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు మండల కేంద్రంలోని జామా, మదీనా మసీదుల్లో ఆదివారం రాష్ట్ర శాసన సభ వ్యవహారాల, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేసి విందులో పాల్గొన్నారు. ఎంపీపీ బన్సోడ రాణీబాయి, జడ్పీటీసీ గుడాల అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మసీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ గయాయోద్దిన్, శాహెద్ షాన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అడవులకు నిప్పంటుకోకుండా సంరక్షించాలి

మంటలను ఆర్పుతున్న డీఎస్పీ నాయకులు

గణపురం, ఏప్రిల్ 7: ఎండలు మండిపోతున్నందున అడవులు కాలిపోకుండా రక్షించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి మహారాజ్ అన్నారు. ఆదివారం మైలారం – గాంధీనగర్ గ్రామాల మధ్య ఉన్న అడవికి నిప్పంటుకుందని తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంటలను ఆర్పేశారు. అడవుల సంరక్షణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వన్యప్రాణులను కాపాడాల్సిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, రేంజ్ ఆఫీసర్లపై ఉందన్నారు.

సీసీపీఎల్ ట్రోఫీ ఆవిష్కరణ

చిట్యాల, ఏప్రిల్ 7 : జయశంకర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ చిట్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ (సీసీపీఎల్) ట్రోఫీని మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మైదానంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత టెక్నాలజీ వైపు దూసుకెళ్తున్నదని, క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. సీసీపీఎల్ ప్రెసిడెంట్ చింతల మహేందర్, కార్యదర్శి పిట్టల అనిల్, వేల్పుల రాజకుమార్, గడ్డం సాయినితిన్, చిట్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రామచందర్, కో ఆప్షన్ మెంబర్ ఎండీ రాజ్‌మహమ్మద్, ఎంపీటీసీ దెబ్బ అనిల్, దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, డబ్బెట రమేశ్, సాంబశివుడు, సుమన్ పాల్గొన్నారు.

సీసీపీఎల్ ట్రోఫీని చూపుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

బోడ శ్రీను మృతి పార్టీకి తీరని లోటు

జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

మంగపేట, ఏప్రిల్ 7 : చుంచుపల్లి గ్రామ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ శ్రీను మృతి పార్టీకి తీరనిలోటని ములుగు జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, మృతుడి అంత్యక్రియలు ఆదివారం చుంచుపల్లిలో నిర్వహించగా, జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ శ్రేణులు హాజరై శ్రీను మృత దేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకులు జగదీశ్, వీ శ్రీధర్ వర్మ, మండల ఇన్‌చార్జి తుమ్మ మల్లారెడ్డి, డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, సీనియర్ నాయకుడు సమ్మయ్య, తిరుపతి, ప్రవీణ్, సుకుమార్, శ్రీను, బాబు, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీహరి, కిశోర్, రాజు, రాము, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, ఏప్రిల్ 7 : మండలంలోని పాలంపేట రామప్ప ఆలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి వేల మంది పర్యాటకులు, మేడారం భక్తులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేశారు.